మండలి ఎన్నికల ప్రక్రియకు ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ఈ నెల 13 వ తేదీన జరగనున్న పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని రెండు స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కొవ్వూరు డివిజన్ పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎమ్ కె మీనా

వెలగపూడి నుంచి ఎం ఎల్ సి ఎన్నికలు అంశానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ, కొవ్వూరు డివిజన్ పరిధిలో 242 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని అన్నారు. ఇందులో 107 మంది పురుషులు, 135 మంది మహిళలు, 3 శాసన సభ్యులు వారి ఓటు హక్కు వినియోగించు కోవడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో జీ. నరసింహులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి , ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ సర్వే

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం అంగరలో క్షేత్ర స్థాయిలో చేపట్టిన భూ సర్వేను పార దర్శకంగా నిర్వహిస్తున్నట్టు రామ చంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం తెలిపారు. అంగరలోని ఆర్బీకే కేంద్రంలో భూ సర్వేపై మండల అధికారులతో సమీక్ష జరిపారు. తహసీల్దార్ కొమరం

సూర్యారావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాం, మండల సర్వేయర్ కె నాగేశ్వరరావులతో చర్చించారు. లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులంతా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వోలు అల్లాడి మల్లేశ్వరరావు, నాగమణి, జాను, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

అన్నదాతల ఆవేదన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలంలో వరి పొలాలకు సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారి పోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. అయినాపురం, సోమి దేవరపాలెం, సురాయిచెరువు, తదితర గ్రామాల్లో ఇప్పటికే

ఎకరానికి 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని పంట పొలాలకు నీరు లేక పంటలను పశుగ్రాసం కింద వాడుకునే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి పంట పొలాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

రూ.3 లక్షలతో నిర్మించిన షెడ్డు ప్రారంభం

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక శ్రీ సరస్వతి దేవి ఆలయ ఆవరణలో చిర్ల వీర్రాఘవరెడ్డి అందించిన రూ.3 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించిన షెడ్డు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభిం చారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్), ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, చిర్ల వీర్రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, పార్టీ పెదపూడి మండలం కన్వీనర్ గుత్తుల రమణ, ఆలయ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్‌ను విజయవంతంగా తగ్గిస్తున్నాం

యశోదా హాస్పిటల్స్ వైద్య నిపుణుడు డాక్టర్ గణేష్ జైశట్వార్

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : బ్లడ్ క్యాన్సర్ ను పూర్తిగా నయంచేసి తిరిగి సాధారణ స్థితికి తీసుకు రావచ్చని సీనియర్ హెమాటాలజిస్టు, బిఎంటి స్పెషలిస్టు యశోద హాస్పి టల్స్ వైద్య నిపుణుడు,బోన్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఫిజిషియన్ డాక్టర్ గణేష్ జైశట్వార్ చెప్పారు. రాజమండ్రిలోని యశోద

హాస్పిటల్ మెడికల్ సెంటర్, రాజమండ్రి బ్లడ్ క్యాన్సర్ సర్వైవర్స్ మీట్‌ను నిర్వహించింది. బ్లడ్ క్యాన్సర్ బారినపడి డాక్టర్ గణేష్ అందించిన చికిత్స, ధైర్యంతో క్యాన్సర్ ను అధిగమించిన ఉమా గంగాధర్,రమేష్ పిల్లా, త్రినాథ్, డాక్టర్ రేష్మా తమ అనుభవాలను చెప్పారు. డాక్టర్ గణేష్ తమకు దేవుడితో సమానమని వారు ఆయనకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ జైశట్వార్ మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ లపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి అవగాహన పెంచేందుకు కృషి చేశారు. మనలాగే పూర్తిగా సాధారణ జీవితం, పేషెంట్ సర్వైవర్స్ మీట్ బ్లడ్ క్యాన్సర్ బారిన పడిన వారిని ముందుకు రావడానికి ఆదుకోవడానికి ప్రజలను ప్రోత్సహిం చడం లక్ష్యంగా ఉందని డాక్టర్ గణేష్ జైషేత్వార్ అన్నారు. భారతదేశంలో సంవత్సరానికి 80,000 కొత్త రక్త క్యాన్సర్లు నిర్ధారణ అవుతున్నా యని, భారతదేశంలో ప్రతి 7 సెకన్లకు ఒక కొత్త రక్త క్యాన్సర్ నిర్ధారణ అవుతోందని తెలిపారు. ప్రతి 20 సెకన్లకు, భారతదేశంలో బ్లడ్ క్యాన్సర్‌తో ఒకరు మరణిస్తున్నారని చెప్పారు. సోమాజిగూడ లోని యశోద హాస్పిటల్స్ ముంగిట గత 8 సంవత్సరాలుగా 300 సిపిఎం లను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్, మేనేజర్ పరమేశ్, అసిస్టెంట్ మేనేజర్ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-దేవరపల్లి: దాతల సహకారం ఎంతో అభినందనీయమని దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ టి. సూర్య కళ, డాక్టర్ వై. సృజన

అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి త్రివేణి ప్యాట్రెన్ గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్, గౌరిపట్నం ఎండి కృనాల్ గుప్తా గారు పది సీలింగ్ ఫ్యాన్లు, 25 కుర్చీలు అందజేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణీలకు ఎంతో ఉపయోగం అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ ఏఆర్ కులకర్ణి, త్రినాథ్ కుమార్, ప్రసన్న మధుసూదన్ రావు ,ఏ శ్రీకృష్ణుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి .సత్యనారాయణ, ఫార్మసిస్ట్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టేకిలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయ అధికారి కెవిఎస్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం

ఎండలు ఎక్కువ వుండే అవకాశం వుంది కనుక ఎర్ర నల్లి ఎక్కువ వుంటుందని, ఆకులు ఎరుపు రంగులో మారి ఆకులు వడిలిపోయినట్టు కనిపిస్తాయన్నారు. ఎక్కువ నష్టం వుంటే డైకోఫాల్ మందు లీటర్ నీటికి 5మిల్లీ చొప్పున లేదా వెట్టబుల్ సల్ఫర్ లీటర్ నీటికి 3గ్రాములు చొప్పున స్ప్రే చేయాలని తెలిపారు. నీటి వంతులు వివరించారు. పొలంబడి రైతులకు 5 లీటర్లు వేప నూనె 50% సబ్సిడీ మీద రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి కెవిఎస్ రమేష్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు జి హరిబాబు, రైతులు హాజరయ్యారు.

మాట తప్పిన ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు

- **ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం**
- **తాటిపాక మధు, టి.అరుణ్ విమర్శ**

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైసీపీకి పాలించే అర్హత ఎక్కడిదని సీపీఐ, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై గురువారం రాజమండ్రి గోకవరం బ స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ ల ఆధ్వ ర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి,పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిఎ బకాయిలు విడుదల చేయాలని,కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దుచేస్తానని జగన్ చెప్పారని, ఇప్పుడు మాట తప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. ఒక్కసారి కూడా డిఎస్‌సి పెట్టలేదని, 1998 బ్యాచ్ సమస్య కూడా పరిష్కారం కాలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా, మభ్యపెట్టి, మైమరపించి మోసం చేస్తున్నారని అన్నారు. మాట తప్పం, మడమ తిప్పమని చెప్పి మాట తప్పారని, మడమ తిప్పారని విమర్శించారు. రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారని, దీనివల్ల వారు ఒత్తిడికి లోనై చనిపోతున్నారని తెలిపారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్ డబ్బు 3 వేలకోట్లను వాడుకునేందుకూ ఉద్యోగులకు అవకాశం లేకుండా చేశారని, ప్రభుత్వమే దోచుకుందని విమర్శించారు. ప్రైవేటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ చట్టం తేవాలని కోరారు. చిన్న స్కూళ్లపై వేధింపులు ఆపాలని డిమాండు చేశారు. పట్టభద్రుల,ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో అధికార వైసిపి నేరుగా జోక్యం చేసుకుని గెలవాలని కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు సిఎం స్థాయిలో ఆదేశాలు జారీచేయడం దాని కోసం అడ్డదారులు తొక్కడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన కక్ష సాధింపు ధోరణిని విడనాడి సిపిఎస్ రద్దుతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ ఎస్ ఎస్ మూర్తి,టి.ఎస్ ప్రకాష్, సిపిఐ నగర కార్యదర్శి కొండలరావు,కె జోజిరాజు,చప్పా రమణ, ఎమ్ ఎస్ రాజు,కె.రామకృష్ణ, సునీల్,నల్ల రామారావు, యడ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మన మహిళా శక్తి ప్రపంచానికే ఆదర్శం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండడమే కాకుండా ఒక వైపు కుటుంబ బాధ్యతలతో పాటు మరోవైపు ఉద్యోగ బాధ్యతలు ఎంతో సమర్థవం తంగా నిర్వహించ డం సమర్థ వంతంగా నిర్వహించడం అభినందనీయ మని మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక శ్రీ

వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రుడా చైర్ పర్సన్ మెడపాటి షర్మిలా రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, పి.డి. మెప్మా, బి. ప్రియంవధ మహిళా అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ మునిసిపల్ కార్యాలయం లో పారిశుధ్య సిబ్బంది మెరుగ్గా పని చేయడం వల్ల శానిటేషన్ కార్పొరేషన్ లో మెరుగ్గా ఉందని కొనియాడారు. సచివాలయ వ్యవస్థ లో వలంటీర్లు ఎక్కువ మంది మహిళలే ఉన్నారన్నారు. రుడా చైర్ పర్సన్ మెడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ హెూలీ పండుగ రోజున మహిళా దినోత్సవం రావడంతో మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణించే వారని, జగనన్న ముఖ్యమంత్రి గా మహిళలకు సముచిత స్థానం కల్పించి మహిళల పేరునే ప్రభుత్వ పథకాలు అమలు చేయడం జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్లు కె. భవాని, ఎ. సావిత్రి, ఎస్. సరస్వతి, కే. వరలక్ష్మి, కార్పొ రేషన్ మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పి. డి. పి. డి. ప్రియం వధ, ఏడిషిన ల్ కమీషనర్, పి. సత్యవేణి, ఎం. హేచ్. ఓ, వినూత్న, రూడా సెక్రటరీ, పి. శైలజ వల్లీ, డిప్యూటీ కమీషనర్, ఎస్. సాంబ శివరావు, పట్టణ మహిళా సమాఖ్య ప్రెసిడెంట్‌లు కే. భవాని, ఏ. సావిత్రి, ఎస్. సరస్వతి, కే. వరలక్ష్మి, తది తరులు పాల్గొన్నారు.

11వ పీఆర్సీ ఎరియర్సు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ పిలుపుమేరకు మండల పెన్షనర్లు అసోసియేషన్ సభ్యులు పదకొండవ పిఆర్సీ వెంటనే అమలు చేయాలని స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా

ఆ సంఘం అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు మాస్టారు మాట్లాడుతూ 1-7-2018 నుండి బకాయి ఉన్న డిఏ ఏరియాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ను జమ చేయాలని 1-7- 2023 నుండి నూతన వేతన సవరణ అమలు చేయవలసిన ఉన్నందున తక్షణమే 12వ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎస్ఎస్‌వి సూరపు రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి. జోగిరాజు, ఎం. రాంబాబు, సిహెచ్ సత్య గాంధీ, ఎస్‌కె జహీరుద్దీన్, మజ్జి తాతారావు, వివిఎస్ అస్మాడ్, ఏబీవీ ప్రసాద్, వెదురుపాక నారాయణ తదితరులు ఉన్నారు.

సచివాలయ వ్యవస్థ మెరుగ్గా పనిచేయాలి

విశాలాంధ్ర - సీతానగరం : సచివాలయ వ్యవస్థ మెరుగ్గా పనిచేయాలని డిఎల్‌డిఓ పి. వీణా దేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడివో కె. రమేష్, డిఎల్‌పిఓ వీణా దేవి ఆధ్వ ర్యంలో సచివాలయ సిబ్బంది, పంచా యతీ కార్యదర్శులతో సమావేశం

ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీణా దేవి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ తీసుకొని వచ్చి మూడు సంవత్సరాలవుతోందన్నారు. వీటి పని తీరు మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. సచివలయాలలో రికార్డులు సక్రమంగా ఉంచాలని, సచివాలయాలో అందించే సేవలకు తీసుకొనే నగదు సకాలంలో ప్రభుత్వం ఖాతాలో జమ చేయాలన్నారు. వారికి విధించిన యూనిఫామ్ తప్పని సరిగా ధరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు సక్రమంగా లబ్దిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి ఆర్. సుజాత, జూనియర్ అసిస్టెంట్ భరణి, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాటవరం కొండలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల్లేవు

విశాలాంధ్ర - సీతానగరం : కాటవరం గ్రామ శివారులోని కొండలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేవు అని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ జాతీయ హరిత గ్రీన్ ట్రిబ్యునల్‌కు తెలియచేశారు. నకుల సురేష్ అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఎన్‌జిటిలో కేసు వేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ కేసు విచారణ గత కొన్ని నెలలుగా జరుగుతోంది. దీనిలో భాగంగా గురువారం జరిగిన విచారణలో కాటవరం కొండ త్రవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ తెలియజేసారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపిన వారి పై చర్యలు తీసుకోవడమేకాకుండా జరిమానా విధిస్తామని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ శాఖ తమ నివేదికలో ముగ్గళ్ళ దగ్గర సుద్దకొండ నుండి లక్ష క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తొర్రేడు దగ్గర రైతులు పొలాలు నింపడానికి వాడారు అని సుమారు 3 కోట్ల రూపాయిల పన్ను చెల్లించేలా డిమాండ్ నోటీసు పంపామని జాతీయ హరిత ట్రిబ్యూనల్‌కి తెలియచేసారు. ప్రస్తుతం గత సంవత్సర కాలంగా కాటవరం కొండ దగ్గర ఎటువంటి త్రవ్వకాలు జరగడం లేదని జిల్లా కలెక్టర్ తమ నివేదికలో పొందుపరిచారు. తదుపరి విచారణ మార్చి 29కి వాయిదా వేస్తూ తీర్పు నిచ్చింది.

గుబ్బల మాస్టర్ ఆకస్మిక మృతికి సంతాపం

విశాలాంధ్ర - అమలాపురం : గుబ్బల సత్యనారాయణ ఆకస్మిక మృతికి సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా సమితిలు తమ ప్రగాఢ సంతాపం తెలిపాయి. అమలాపురం బండి వారి పేట కమ్యూనిటీ హాల్లో కె

సత్యవేణి అధ్యక్షతన సంతాప సభ జరిగింది. సత్యనారాయణ మాస్టారు పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి వారి భార్య మాతకస్తూరి, చిన్న కుమారుడిని ఓదార్చారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు మద్దతు

విశాలాంధ్ర - కాకినాడ : సిపిఎస్ రద్దు కొరకు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం కాకినాడ ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద

నిరసన ధర్నా జరిగింది. సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, డిఏ, ఇంక్రిమెంట్, బోనస్ మంజూరు చేయాలని, నెలవారి జీతాలు 1 తేదీన మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బోడకొండ, సిపిఎం జిల్లా నాయకుల దువ్వా శేషులు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే వరకు ఉద్యోగులు ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి సిపిఐ, సిపిఎం మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం కాకినాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో లేని ఈ జిల్లాలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన చేయకుండా దమనకాండ విధానం కొనసాగిస్తున్నారని, దీనిని మేం వ్యతిరేకిస్తున్నామని వారన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, సిపిఎం నాయకులు వీరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం వైసీపీ విధానాలు రుద్దడం మానుకోవాలని, గడపగడపకు వైఎస్ఆర్సిపి పేరుతో అధికారులను వారి వెంట తిప్పుకోవడం సరికాదని, దీనివల్ల కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల చాలా పనులు పెండింగ్లో ఉంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు అయితా బత్తుల రామేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి లోవ రత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, కేశవరపు అప్పలరాజు, శాఖ రామకృష్ణ, నక్క అప్పలకొండ, అన్నవరం సిపిఎం నాయకులు అజయ్ కుమార్, వీరబాబు, రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలశం సెంటర్ వద్ద వామపక్షాల ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : ఉద్యోగ ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను నిలుపు చేసి ఉద్యోగ సంఘాల ఐకాస ఇచ్చిన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాలని, ఉద్యోగులకు మద్దతుగా 9, 10, రెండు రోజులు నిరసన ధర్నా చేపట్టాలని రాష్ట్ర

వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా 10 తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు అమలాపురం కలశం సెంటర్ వద్ద వామపక్ష పార్టీలు కార్యాచరణ చేపట్టనున్నట్టు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు తెలిపారు.

మంచినీటి కాలువలో కళేబరాలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం పరిధిలోని సుమారు 20 గ్రామాలకు త్రాగునీరు అందించే జి.వేమవరం కుళాయి చెరు వుకు నీరందించే గొర్రి పూడి పెద్దకాలువ పంప్ హౌస్ దగ్గర పందుల కళేబరాలు కాలువలో తేలియాడుతూ దర్శనమిస్తు న్నాయి. గత 10 రోజుల నుంచి దుర్గంధం వెదజల్లు తున్నా సంబంధిత యంత్రాంగం, పంచాయతీ

అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉండి కళ్ళకు కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు ఇదే స్థితిలో పంప్ హౌస్ నుంచి కుళాయి చెరువుకు నీరు పంపుతున్నారు. ప్రస్తుతం విషజ్వరాలతో భీతుల్లుతున్న ప్రజలు పంప్ హౌస్ దగ్గర ఈ పరిస్థితి తెలిసి కుళాయినీరు త్రాగడానికి బెంబేలెత్తుతున్నారు. అధికారులు తక్షణమే ఈ కళేబరాలు తొలగించి, క్లోరినేషన్ చేయించాలని గొర్రిపూడి ప్రజలు కోరుకుంటున్నారు.

పొగాకు రైతు మృతి

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం సంగారెడ్డి గ్రామానికి చెందిన పొగాకు రైతు సవలం పెద్ద నారాయణ ఆకస్మికంగా మృతి చెందారు. ఈ మేరకు రాజమండ్రి పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జి ఎల్ కే ప్రసాద్ రైతు సంక్షేమ నిధి నుండి 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆయన తల్లి లక్ష్మికి అంద జేశారు. సంగాయి గూడెం గ్రామ సర్పంచ్ కరుటూరి ఉషారాణి శ్రీనివాస్ చేతుల మీదుగా సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ రైతు నాయకుడు కుసులూరి శ్రీనివాస్ ఎస్ జి ఓ శివకుమార్ ఫీల్డ్ ఆఫీసర్ హరే రామ్ తదితరులు ఉన్నారు.

ప్రకటన

నా క్లయింటు డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలం నడవపల్లి పంచాయతీ నడవపల్లి గ్రామ కాపురస్తులు **దంతులూరి సూర్యనారాయణ రాజు గారి కుమారుడు శ్రీ దంతులూరి వెంకట సూర్య సత్యనారాయణ వర్మ గారు** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియ చేయునది ఏమనగా

(ఉమ్మడి) తూర్పు గోదావరి జిల్లా కాకినాడ తాలూకా కాకినాడ సబ్ రిజిస్ట్రీలో చేరిన తురంగి గ్రామ పంచాయతీలో చేరిన తురంగి గ్రామం తాలూకు నివేశన స్థలమ్ రి. స.నెం. **140 - 1లో పూరా య.14-18ట్లులో** చదరపు గజములు **380లు = 317.72** చ. మీ. స్థలం యొక్క **నం. 2671/1978** ఒరిజినల్ దస్తావేజులు కనిపించకుండా పోయినందున ఎంత వెతికినా దొరకనందున యావన్మందికి తెలియచేయునది ఏమనగా సదరు పైన ఉదహరించిన ఆస్తిపై నా క్లయింట్ జరపబోవు క్రయ విక్రయములకు ఎవరికయినను ఎటువంటి అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన తేదీ నుండి ఒక వారము రోజులలోపు నాకు తమ అభ్యంతరములు తెలియ చేయవలెను. లేని యెడల ఎవరికి ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి సదరు ఆస్తిపై తదుపరి వ్యవహారములు జరిపించబడును.

బీర వెంకట ప్రసాద్ బాబు, అడ్వకేట్
కాట్రేనికోన, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. సెల్ : 9849422303

పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

సమన్వయ శాఖల అధికారులతో కాకినాడ జిల్లా డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి

విశాలాంధ్ర - కాకినాడ : వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, పటిష్ట ఏర్పాట్లతో పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కాకినాడ జిల్లా రెవెన్యూ

అధికారి కె.శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో.. జిల్లాలో పదో తరగతి రెగ్యులర్ పరీక్షలతో పాటు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పాఠశాల విద్య, ఓపెన్ స్కూల్ సొసైటీ, పోస్టల్, పోలీస్, రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్యం, ఆర్టీసీ, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. పరీక్ష కేంద్రాలు, పరీక్ష పత్రాల స్టోరేజ్ పాయింట్లు, పోలీస్ బందోబస్తు, ఆర్‌టీసీ బస్సుల ఏర్పాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రెగ్యులర్ ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ (ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్) పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో రెగ్యులర్ పదో తరగతి పరీక్షలు 136 కేంద్రాల్లో జరగనున్నాయని వాటిలో 99 బీ కేటగిరీ సెంటర్లు, 37 సీ కేటగిరీ సెంటర్లు ఉన్నట్లు వివరించారు. ఈ పరీక్షలు రాసేందుకు 29,988 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గం. నుంచి 12.45 గం. వరకు పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. ఓపెన్ (ఎస్ఎస్‌సీ, ఇంటర్) పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. వీటికి 7,341 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు వివరించారు. పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం దగ్గరి నుంచి జవాబు పత్రాలను తిరిగి పంపేవరకు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కాకినాడ జిల్లా డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయివెంకటరమణ, డీపీవో ఆర్.విక్టర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు హాజరయ్యారు.

నులిపురుగుల నివారణ సమర్థవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర - అమలాపురం : ఆరోగ్య వంతమైన సమాజ స్థాపన కోసం ఒకటి నుండి 19 మధ్య వయసు గల చిన్నారులకు నులిపురుగుల నుండి రక్షణ కల్పించాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల మేరకు నులి పురుగుల నివారణ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా సమన్వయ కమిటీ సభ్యులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సన్నద్ధతపై జిల్లా సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14వ తేదీ మంగళవారం జాతీయ

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా అమలుచేసి నులిపురుగుల నుండి బాలబాలికలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. పిల్లలు, కిషోర్ బాలికలు కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదలను ప్రోత్సహించే దిశగా ఈ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయా లని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, డిఎం అండ్ హెచ్ఓ ఎం. దుర్గారావు దొర, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. కమల కుమారి, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.శివశంకర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు వి. జ్యోతిలక్ష్మి దేవి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి టి. వెంకటేశ్వర్లు, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం మేనేజర్ జాన్, ఎవిడేషన్ యాక్షన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అదనపు డిఎం హెచ్వో సిహెచ్ వి. భరత లక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు విఐ పి.నాయుడు, కే శ్రీకాంత్ రెడ్డి, లోవ రాజు, రామ్మూర్తి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : రాజోలు నియోజకవర్గంలోని గెద్దాడ గ్రామానికి స్మశాన వాటికకు స్థలం కేటా యించాలని గెద్దాడ గ్రామ ప్రజానీకం డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు స్మశాన వాటిక ఏర్పాటు చేసేంత వరకూ 216 జాతీయ రహదారి నిర్మాణ పనులను ఆపాలని గ్రామప్రజలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గెద్దాడ గ్రామ వాసులు మాట్లాడుతూ మామిడికుదురు మండలంలోని గెద్దాడ గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 42లో ఎకరా 38 సెంట్లు స్మశాన వాటిక స్థలంగుండా 216 జాతీయ రహదారి వెళ్ళిందని ఐతే గ్రామస్తులు జాతీయ రహదారి స్మశాన వాటికను తప్పించుకుని వేసుకోవాలని కోరారు. స్మశాన వాటికను తప్పించడం కుదరని పక్షంలో దీనికి

ప్రత్యామ్నాయంగా ప్రక్కనే దక్షిణం వైపు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 41లో ఎకరా 10 సెంట్లు భూమిని గ్రామస్థులకు కేటాయిస్తామని ఎన్‌హెచ్ అధికారులు, జాయింట్ కలక్టర్, భూ సేకరణ అధికారి రెవిన్యూ అధికారులు గతంలో గ్రామస్తులకు హామీ ఇచ్చారని నిర్వాసితులు తెలిపారు. సుమారు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకూ గ్రామస్తులకు స్మశాన వాటికకు కేటాయిస్తా నన్న స్థలం కేటాయించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జవ్వాది సత్తిబాబు, వైఎస్సార్సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు గూటం వెంకటేష్, గ్రామస్థులు గుబ్బల ప్రసాద్, కలిగితి రాజేష్ కుమార్, మధుర కోటేశ్వరరావు, ఉచ్చుల కమలాకర్ ,గూటం రాజేష్, కుసుమ గణేష్, గుబ్బల కృష్ణ, కలిగిత దిలీప్, ములపర్తి కార్తిక్, తాడి శేఖర్, గోపాలం, యడ్ల నాగరాజు, ఊక్యూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

మండపేట పోస్టాఫీసుకు అవార్డుల పంట

తపాలా ఉద్యోగుల శ్రమకు తగిన గుర్తింపు

విశాలాంధ్ర - మండపేట : మండపేట ప్రధాన తపాలా కార్యాలయానికి రామచంద్రపురం సబ్ డివిజన్ స్థాయిలో ఉత్తమ అవార్డులు లభించాయి. తపాలా శాఖకు చెందిన వివిధ ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో డివిజన్లో అగ్రగామిగా మండపేట ప్రధాన తపాలా కార్యాలయం నిలిచింది. ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన భేటీ బచావో బేటీ

పడావో అనే కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల ఆర్థిక భద్రత కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని మండపేటలో అన్ని వార్డుల్లో ఎంతో వైభవోపేతంగా అమలు జరిపారు. అన్ని వార్డుల్లో ప్రజలకు ఆయా కౌన్సిలర్ల చేత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆడపిల్లల తల్లుల పేరున 250 రూపాయలతో ఈ ఖాతాను ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 250 నుండి 1,50,000 వరకు ఎంతైనా జమ చేసుకోవచ్చు. ప్రధాన పోస్ట్ మాస్టర్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ పోస్టుమాస్టర్‌గా ఎన్. శ్రీనివాసరెడ్డి, సుకన్య సమృద్ధి యోజన పథకంలో డివిజన్ స్థాయిలో అత్యధిక ఎకౌంట్లు చేసిన కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో వాసంశెట్టి గోవిందు, అకౌంట్స్ ఓపెనింగ్‌లో ద్వితీయ స్థానం సాధించడంతో పాటు ఉత్తమ పోస్ట్ ఉమెన్‌గా సిద్ది రెడ్డి దుర్గాదేవి అవార్డులు అందుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ స్థాయిలో బెస్ట్ పోస్టు ఉమెన్‌గా మేడిశెట్టి అనూష ఘన సత్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కరించుకొని రామచంద్రపురంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బందికి అవార్డులను అందజేశారు.

100 ఎకౌంట్లు పూర్తి చేసిన కొండపల్లి సూర్యనారాయణ : మండపేట ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన ఒకే రోజున 100 సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోస్టుమాస్టర్ టి.పుల్లేశ్వరరావు, కొండపల్లి సూర్యనారాయణ, వి. గోవింద్, ఎండీఎం షరీఫ్, కే. ఈశ్వరరావు, క్లబ్ కార్యదర్శి జి. వెంకట్రావు, చెల్లుబోయిన శ్రీనివాస్, ఎం. అనూష, కే. అనూష, హైకోర్టు న్యాయవాది టీవీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనకు ముందు నూరు శాతం అందించి జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం. సూర్య తేజ అన్నారు.గురువారం మార్చి 14 వ తేదీ జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో జిల్లా ఇన్చార్జి జిల్లా జాయింటు కలెక్టరు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచ్చార్జి జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన విద్యార్థిని, విద్యార్థులకు డీవార్మింగ్ టాబ్లెట్స్ అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ ద్వారా 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ప్రతీ ఒక్కరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్స్ వేయడం జరుగుతుందన్నారు. జిల్లా, మండల స్థాయిలలో వైద్య, విద్యా, ఐసిడిఎస్ శాఖల సమన్వయంతో పనిచేసి జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు డి. ఉమా మహేశ్వర రావు మాట్లాడుతూ 1 నుండి 2 సం. పిల్లలకు సగం మాత్రను పొడిచేసి మంచి నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయరాదని, వారికి నయమైన తర్వాత మాత్రమే ఇవ్వాలని డాక్టర్ మహేశ్వర రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. మహేశ్వర రావు, జిల్లా ప్రోగ్రాం అధికారి జె.రమణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, సర్వ శిక్ష అభియాన్ పి వో పి.శ్యామ్ సుందర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె. శోభా రాణి, ఐసిడియస్ అధికారి బి.సుజాతా రాణి, డిప్యూటీ డియంహెచ్‌వో డాక్టర్ వి. ప్రసాదు, డి ఎల్ డి ఓ కె.కిషోర్ కుమార్ ,తదితర అధికారులు,తది తరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జల్లి కొమ్మర గ్రామంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ ఆర్ ఎస్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి వెలుగు డాక్టర్ ఐ శ్రీనివాస్ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 61మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 61మంది కళ్ళజోళ్ళ పడినట్లు శ్రీనివాస్ తెలిపారు.61 మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జె. విల్సన్ బాబు,ఏఎన్ఎంలు జి. కనకలక్ష్మి, ఎ.కెంపురత్నం, పి.కవిత,దైవ కుమారి, శిరీష, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసహనం

విశాలాంధ్ర-తణుకు: వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు కష్టాలే ఎదురవుతున్నాయని జనసేన పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు అన్నారు. మండపాక గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా జనసేన పార్టీ అధికారంలోకి రావాలని కోరుకొంటున్నారన్నారు. వైసీపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ తణుకు నియోజకవర్గ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు కోరారు. గత ఏడాది కంటే ఈ ఏడాది జనసేన పార్టీ సభ్యత్వాలు పెరిగాయని తెలిపారు.ఆవిర్భావ సభకు తణుకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, విడివాడ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తుల పై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: అక్రమంగా అడవిలోకి ప్రవేశించి ఫారెస్ట్ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ ఐ కె సతీష్ కుమార్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం కంపార్ట్మెంట్ నెం.223,224,225ల లోనికి కొత్త గూడెం గ్రామానికి చెందిన గజ్జెల ములకయ్య,కత్తి సత్తిబాబు, కాకర్ల పుల్లయ్య, నిజవరపు నాగమ్మతో పాటు కొంత మంది ఉద్దేశ పూర్వకంగా అక్రమంగా అడవిలోకి ప్రవేశించి అడవిని నరికి, నిప్పు పెట్టి కాలుస్తున్న సమయంలో ఆపడానికి ప్రయత్నించిన అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఎ. జయ బాబు,బేస్ క్యాంప్ ప్రొటక్షన్ హెల్పర్ టి. గంగరాజు లను భయభ్రాంతులకు గురిచేసి వారి విధులకు ఆటంకం కలిగించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి నట్లుగా ఆయన తెలిపారు.

విజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠితమైన శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొనకళ్ల పెద సోంబాబు రూ.50వేల 116లు విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా దాత సోంబాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి మాడా రామమోహనరావు ఆధ్వర్యంలో కొనకళ్ళ పెద సోంబాబును శేష వస్త్రాలతో,ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కందులపాటి శ్రీని వాసరావు, రామిశెట్టి శ్రీనివాసరావు,గుడిమెట్ల యుగంధర్,కందులపాటి సురేష్,గుడిమెట్ల సత్యనారాయణ(జీ ఎస్),కర్పూరం మహేశ్వరరావు,గెడ్డం శ్రీనివాస్, ,యర్రం ఉదయ్ కుమార్,వందనపు అప్పలరాజు, కర్పూరం తుకారం, తొంటా శ్రీనివాసరావు, బిక్కిన మోహన్ బాబు, రాజపురోహిత్ అశోక్ సింఘాల్, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర -కామవరపుకోట: యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని సెట్ వెల్ సిఇఓ యం.డి.హెచ్. మెహరాజ్ కోరారు. స్థానిక మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో విద్యార్థిని విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్సు పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్.విజయ కుమార్, ప్రిన్సిపాల్ యం. మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్ళడానికి లక్ష్యంతో కృషిచేయాలని, పట్టుదలతో చదివి జ్ఞానం సంపాదించాలని జ్ఞానంతో లక్ష్యాలను సాధించాలని, డిగ్రీ స్థాయి నుండి ఆర్థిక ప్రణాళికలు అలవరచుకోవాలని విద్యార్థులకు ఉపదేశించారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, సెట్ వెల్.ఎ.ఓ. కె.జె.కెనడి, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు వైద్య సిబ్బంది సహాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : గత రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదం వలన నష్టపోయిన కన్నాయిగుట్ట బాధితులకు, స్థానిక వైద్య సిబ్బంది గురువారం సహాయం అందించారు. ప్రభుత్వ వైద్యులు నాగ గణేష్, మాధురి ఆధ్వర్యంలో స్థానిక కోయిదా పీ.హెచ్.సి పరిధిలోని వైద్య సిబ్బంది కలిసి నష్టపోయిన 27 కుటుంబాలకు స్టీల్ సామాగ్రి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎం. సీత, నాగరత్నం, విజయలక్ష్మి, బుచ్చయ్య, ఎం. విజయ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర-ఏలూరు: కారుణ్య నియమకాలు ద్వారా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆర్టిసిలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు చెందిన ఆరుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఆర్‌టిసిలో పనిచేస్తూ దురదృష్టవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకాలను అర్హతను బట్టి చేయడం జరిగిందన్నారు. ఖాళీల సంఖ్య ,రోస్టర్, తదితరాల ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ, పట్టణ స్థాయిలో ప్రజాసేవ చేసే అవకాశం దొరికిందని చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేయాలని అభ్యర్థులకు కలెక్టర్ సూచించారు. శ్రామిక్ టి. భగవాన్ కుమారుడైన టి. దుర్గాప్రసాద్‌కు, డ్రైవర్ ఎస్.కె. ఇబ్రహీం బేగ్ కుమార్తె అయిన ఫాతిమున్నీసాకు, కండక్టర్ కె. నాగేశ్వరరావు కుమారుడైన కె. దీపక్ కుమార్‌కు, కండక్టర్ ఎల్. నాగేశ్వరరావు కుమారుడైన ఎల్ హెచ్ సోమశేఖర్ కు, డిప్యూటీ సిఎంఇ బి. కృష్ణ కుమార్తె బి. లక్ష్మీసౌమ్యకు, డ్రైవర్ బి. రామకృష్ణరాజు కుమారుడైన బిటి వెంకట రాజులకు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ను కేటాయిస్తూ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కలెక్టర్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎస్ఎస్ మూర్తి, ఏలూరు జిల్లా ప్రజా రవాణాధికారి(ఆర్.టీ.సి) ఎన్ వి ఆర్ వరప్రసాద్, కార్యాలయ సూపరింటెండెంట్ వేణుగోపాల్, పిఆర్‌వో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తిస్థాయిలో అందించామని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాకు తెలియజేసారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి జిల్లాల కలెక్టర్లు, రిటర్నింగ్ అధికార్లతో రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఏలూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి, మైక్రో అబ్జర్వర్ లకు ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను తెలియజేస్తూ రెండు విడతలలో శిక్షణ అందించామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శుక్రవారం రెండవ విడత శిక్షణా తరగతులు అందిస్తామని, దీంతో సిబ్బందికి శిక్షణా తరగతులు పూర్తవుతాయన్నారు. జిల్లాలో జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటుకు, వెబ్ కాస్టింగ్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి 1300 బ్యాలెట్ పేపర్లు ముద్రించామన్నారు. ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి . అరుణ్ బాబు, డి ఆర్ ఓ ఏ .వి. ఎస్. ఎస్. మూర్తి, జిల్లా పరిషత్ సీఈఓ కె. రవికుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై. రామకృష్ణ, ప్రభృతులు పాల్గొన్నారు.

భూమిని స్వాధీనం చేయాలని నిరాహారదీక్ష

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : దేశం కోసం పోరాడిన ఫలితంగా నాడు మిలటరీ వారు కొయ్యల గూడెం మండలం గవరవరం గ్రామానికి చెందిన కొల్లి వెంకన్నకు 1947 సంవత్సరంలో కేటాయించిన 5 ఎకరాల భూమి అన్యాక్రాంతం అవుతుందని తమ ఐదెకరాల పొలాన్ని తమకు ఇప్పించాలని కోరుతూ చొప్ప రామన్నగూడెం గ్రామంలో కొల్లి వెంకన్న పొలంలోని అతని కుమారుడు కొల్లి గాబ్రియెల్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. గాబ్రియేల్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం మిలటరీలో చేరి సైనికునిగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన తన తండ్రికి మిలటరీ వారు ప్రభుత్వం తరఫున ఇచ్చిన ఐదెకరాల భూమిలో వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తమ పొలంలో ఆనుకుని ఉన్న కాడికట్టు రైతు తమ పొలంలో కొంత భూమిని ఆక్రమించుకున్నారని, తమ పొలాన్ని తమకు ఇప్పించాలని ఈ పొలం ఆధారంగానే తమ కుటుంబమంతా వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని ప్రభుత్వం వారు తమను ఆదుకుని న్యాయం చేయాలని గాబ్రియేల్ కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ పి. నాగమణి మాట్లాడుతూ ఆ భూమికి ఎటువంటి ధ్రువపత్రాలు లేవని, అది చెరువుకి సంబంధించిన భూమి అని, ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. నిరాహార దీక్షలో గాబ్రియెల్ కుటుంబ సభ్యులు రత్నకుమారి,అన్నమ్మ, శాంతి, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లి చంద్రశేఖర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించండి

విశాలాంధ్ర -భీమవరం: ఉమ్మడి గోదావరి జిల్లాల స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో ఏపీ పంచాయతీ చాంబర్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ కు 1వ ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో పితాని మాట్లాడుతూ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ అధికార బలాన్ని ప్రయోగిస్తూ ప్రజాప్రతినిధులు రహస్యంగా వేసిన ఓటు వైసీపీ వారికి తెలుస్తుందని భయ భయభ్రాంతులు గురిచేయడం హాస్యాస్పదం అన్నారు. ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ బ్యాలెట్ లోని 4 నెంబర్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి జిల్లాల స్థానికసంస్థల ప్రజా ప్రతినిధులు కోరారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎటువంటి నిధులు మంజూరు చేయకుండా అభివృద్ధిని పట్టించుకోవడంలేదని స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు ఏపీ పంచాయతీ చాంబర్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ కు మొదటి ఓటువేసి గెలిపించి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పొత్తూరి రామాంజనేయరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్, ఆచంట జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలకు మందుల పంపిణీ

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు రూరల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐరన్ సిరప్, మల్టీ విటమిన్ సిరప్, కాల్షియం టాబ్లెట్లు, వివిధ రకాల పండ్లు వైద్యాధికారి చేతుల మీదుగా పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వెంకట వీర వెంకట సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యు. సురేష్, సెక్రటరీ విత్తనాల త్రిమూర్తులు, ట్రెజరర్ యు. ప్రసన్న, సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, పండు, ఏసుబాబు, వ్యాగ్రేశ్వర ప్రసాద్, గణపతి, నాయకులు బందారు మల్లి, నూకపేయి చిన్న, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కారాగారంలో మహిళా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక మహిళా కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, బాధ్యతల గురించి ప్రత్యూష కుమారి తెలియజేశారు. మహిళలు వారి హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు వారి బాధ్యతలను నిర్వర్తించాలని అన్నారు. ఒక కుటుంబానికి మార్గ నిర్దేశకంగా మహిళ ఉండాలని అన్నారు. అనవసరమైన తగాదాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఖైదీలతో చెప్పారు. మహిళల సాధికారతకు కృషి చేసిన వారిని స్ఫూర్తిగా తీసుకుని అత్యున్నత స్థాయికి మహిళలు ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక మహిళా కారాగార సూపరింటెండెంట్ వసంత కుమారి, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామంలో జై కిసాన్ వృద్ధుల ఆశ్రమంలో దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో కీర్తి శేషులు శ్రీ ఉప్పలపాటి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో అన్ని వృద్ధాశ్రమాలకు మానవత సంస్థ సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. వృద్ధాశ్రమం తరుపున డి .భీమరాజు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సహాయ సహకారాలకు అభినందనలు తెలియజేస్తూ బలుసు సత్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సహాయ కార్యదర్శి పోతుల కాశి, మండల డైరెక్టర్ ఆచంట సుభాష్ చంద్రబోస్, ఆచంట రాంబాబు తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నిరసన

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు గ్రామంలో చాగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో చాగల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద కొవ్వూరు నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మెంబర్ అమర్జహ బేగ్ మహమ్మద్ మాట్లాడుతూ ఏఐసిసి, ఏపీసీసీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈనెల 6 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది.కేంద్ర ప్రభుత్వం ఆదాని అనే పారి శ్రామికవేత్త కి ఎల్ఐసి మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న వేల కోట్లు ఆదాని గ్రూప్ కి బలవంతంగా అప్పు ఇచ్చారని, ఇప్పుడు ఆ సంస్థ పీకల్లోతులలో మునిగిపోయిందని అన్నారు. వేలకోట్లకి సమాధానం ఇప్పుడు దేశ ప్రధాని జవాబు చెప్పాలని ,వెంటనే ఆదానీ ఆస్తుల ఈడీ అటాచ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి చాగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టా సుబ్బారావు ,కొవ్వూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పుల్లారావు, తాళ్లపూడి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుబ్బారావు ,జిల్లా ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ జొన్నకూటి రవికుమార్ ,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గెల్లా భాస్కరరావు, జిల్లా సెక్రెటరీ బి. రమణ, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రైన్ నిర్మాణం పనుల పరిశీలన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో బొబ్బర్లంక, రాజవరం గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్మిస్తున్న రోడ్డు, డ్రైన్ నిర్మాణం పనులను ఎంపీడీవో నాతి బుజ్జి పరిశీలించారు. బొబ్బర్లంక నుంచి స్పందన కార్యక్రమంలో చేసిన ఫిర్యాదుపై ఎంపిడిఓ నాతి బుజ్జి పరిశీలన చేసారు. బొబ్బర్లంక గ్రామంలో జరగబోవు వార్డు మెంబర్ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్దను తనిఖీ చేసారు. రాజవరం గ్రామంలో జురుగుతున్న హౌసింగ్ నిర్మాణాలపై లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో పంచాయితీ కార్యదర్శి, బొబ్బర్లంక, గ్రేడ్-5 పంచాయితీ కార్యదర్శులు శివరామకృష్ణ, హనుమ, ధర్మేంద్ర, సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి వెంకన్న, మాజీ సర్పంచి కోమలి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఇండియాస్ ఫస్ట్ బ్రైడల్ స్టోర్ 'ప్లష్'

- ప్రారంభోత్సవంలో సందడి చేసిన సెలబ్రిటీలు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : చెన్నై కేంద్రంగా భారత దేశంలోనే ప్రప్రథమ బ్రైడల్ స్టోర్‌గా నడుస్తున్న 'ప్లష్' వెడ్డింగ్ సూపర్ మార్కెట్ ఇప్పుడు మన రాజమహేంద్ర వరం నగరానికి వచ్చింది. వివాహ వేడుకల్లో వధువులకు అవసరమయ్యే అన్న వస్తువులతో పాటు, అన్ని సేవలను 'ప్లష్' ఒకేచోట అందించనుంది. నటి, సెలబ్రిటీ సంతోషి శ్రీకర్, నగరానికి చెందిన మంతెన రమల భాగస్వామ్యంలో స్థానిక జెఎన్ రోడ్‌లో కిఫ్ భవనంలో గురువారం 'ప్లష్' బ్రైడల్ స్టోర్ ఘనంగా ప్రారంభమయ్యింది. రాజమహేంద్రరం పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్, మోనా మార్గాని, రుడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ద్వారకాతిరుమల మాజీ డైరెక్టర్ కొత్త విజయ రాజ్యలక్ష్మి, ప్రముఖ యాంకర్, నటి సుమ కనకాల, నటి సంగీత, సెలబ్రిటీలు రచయిత, నీలిమలు 'ప్లష్' బ్రైడల్ స్టోర్‌ను, వివిధ విభాగాలను ప్రారంభించారు.

నోటి క్యాన్సర్ ప్రాథమిక దశలోనే గుర్తించాలి

విశాలాంధ్ర-ఏలూరు: నోటి క్యాన్సర్ లక్షణాలని ప్రాథమిక దశ లోనే గుర్తిస్తే నివారించ వచ్చుని విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్ అన్నారు. జాతీయ నోటి ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు గురువారం నోటి క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దంత సమస్యల గురించి నోటి క్యాన్సర్ గురించి రోగులకు అవగాహన కల్పించడంతో పాటు వెల్ స్కోప్ అనే పరికరం ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు.ఈ వెల్ స్కోప్ పరికరంతో చాలా సులభంగా నోటి కాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయవచ్చని తెలియజేస్తూ తన డాక్టర్ల బృందంతో వచ్చి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏ డిఎమ్ ఈ సూపరింటెండెంట్ డా. విజయ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. ఆశ, అదనపు డి ఎం హెచ్ ఓ డాక్టర్ రత్నకుమారి, ఎన్సీడీ, ఆర్బీ ఎస్ కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్. మానస, ఆర్ ఎం ఓ డాక్టర్ పి . శ్రీనివాసరావు, డెంటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉష, దంత వైద్యులు, పెదపాడు, పోతునూరు, వట్లూరు, పెదవేగి, చాటపర్రు పీహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన చాలా ముఖ్యం

ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ : అవయవ దానంతో ప్రాణదానం చేయవచ్చునని, అవయవ దానంపై ప్రజలలో అవ గాహన కల్పించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కాకినాడ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో కిడ్నీ ఆరోగ్యం, వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు స్థానిక హోటల్లో గురువారం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కొరకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పరిధి విస్తరించి అనేక వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైద్యుల కొరత గుర్తించి దాదాపు 13 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి అనేక చర్యలు చేపట్టారన్నారు. రాష్ట్రంలోని వైద్య నిపుణుల సూచనలు, సలహాలు మేరకు వైద్య సేవలలో అనేక మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఐవి రావు మాట్లాడుతూ కిడ్నీ ఆరోగ్యం, వ్యాధులు నివారణ, కిడ్నీ, అవయవాల దానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అపోలో ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ జివి రావు, డాక్టర్ సిహెచ్ కరుణాకర్ రెడ్డి, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్విఎల్ నరసింహం, తదితరులు ప్రసంగించారు. ఈసందర్భంగా విజయవంతం గా కిడ్నీ మార్పిడి చికిత్స పొందిన ముగ్గురు రోగులను పరిచయం చేసారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి. రవీంద్ర, పి. శర్దిష్ట, నాగేశ్వర రావు, పిపి ఛటర్జీ, అపోలో సీనియర్ జనరల్ మేనేజర్ ఐవి రమణ, డిజిఎం జీవిఆర్ మూర్తి, అపోలో సిబ్బంది తదతరులు పాల్గొన్నారు

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు, వంట పాత్రలు బహూకరణ

విశాలాంధ్ర - కాకినాడ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక మెహరనగర్‌లోని మానవీయ ఓల్డేజ్ హెూమ్నకు నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు బహూకరించారు. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ యూనిట్ వైస్ చైర్మన్ పి.అరుణ ముఖ్యఅతిథిగా విచ్చేసి వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి అరుణ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ యూనిట్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవీయ ఓల్డేజ్ హెూమ్‌లోని వృద్ధుల కోసం నిత్యావసరాలు, వంట సామాగ్రి పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ యూనిట్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు జి శ్రీధర్, యు రాంబాబు, లక్ష్మి, సూర్య, మానవీయ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పని కల్పిస్తాం : సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - గండేపల్లి : జిల్లాలో జాబ్ కార్డు కలిగిన వ్యవసాయ కూలీలకు పని కల్పిస్తామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పిడి అడపా వెంకటలక్ష్మి సూచించారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ఉండటం వలన కూలీలు సక్రమంగా ఉపాధి పనికి రావడంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా 17 లక్షల పని దినాలు కనిపించాల్సి ఉందని వాటిని పూర్తి చేసేందుకు రోజుకు లక్ష పని దినాలు కల్పించే విధంగా టార్గెట్ పెట్టుకుని పని చేస్తుంటే కనీసం 40 వేలు పని దినాలు కూడా పూర్తి కావడం లేదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 59 లక్షల 93వేల పనిదినాలు కల్పించడం జరిగిందని ఇందుకుగాను 138 కోట్ల 63 లక్షల రూపాయలు వేతనాలుగా చెల్లించామని మెటీరియల్‌కు గాను 95 కోట్ల 37 లక్షలు ఖర్చు చేశామన్నారు. వేతన రూపేణా ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే దానిలో 40శాతం నిధులు మెటీరియల్ కొరకు ఖర్చు చేసేందుకు అవకాశం ఉంటుందని దీని ద్వారా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు వీలుంటుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీలు పనికి వెళ్లి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "సెంటర్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్మెంట్"

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఉమెన్ ఎంపవర్మెంట్ అనే కార్యక్రమం ది.09.03.2023న ఐసిటి అకాడమి వారి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ ఇనిషియేటివ్ "హనీవెల్" వారు 15 రోజుల సర్టిఫికేషన్ కోర్సును తమ కళాశాల ఆఖరి సంవత్సరం మహిళా విద్యార్థినులకు గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సుని ఉచితంగా నిర్వహిస్తున్నారని కళాశాల ఛైర్మన్ డాక్టర్ కృష్ణారావు తెలియచేసారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా పి కృష్ణారావు మాట్లాడుతూ, డి ప్రశాంత్, కె సత్యబాబు మరియు శేషగిరిరావులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా అధునాతన టెక్నాలజీలను పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ, మొత్తం ఈ కోర్సుకి 110 మంది విద్యార్థినిలు రిజిష్టరు అయ్యారని దీని ద్వారా వారు ఇండస్ట్రీ 4.0 స్కిల్సు పెంపొందించుకోవచ్చని అన్నారు. అనంతరం డా ఎస్ కోటేశ్వరి, కన్వీనర్, ఉమెన్ ఎంపవర్మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ వారు పి నాగేంద్ర, హెడ్, కోర్పొరేట్ రిలేషన్స్,ప్లేస్మెంట్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, అకడమిక్-డైరక్టర్ డా ఎస్ శంభు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకులు, ఈవెంట్ కో-ఆర్డినేటర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

విశాలాంధ్ర - గోపాలపురం : వరి పొలాల్లో మిత్ర పురుగులు ఎక్కువగాను వాటికి హాని చేసే శత్రు పురుగులు కాండం తొలుచు పురుగు, ఆకు ముడత, సుడిదోమ ఉధృతి తక్కువగా వున్నప్పుడే సస్యరక్షణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సిహెచ్.వి.నరసింహారావు తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాయపాలెం క్లస్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంచి వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలలో నిర్వహిస్తున్న వైయస్సార్ క్లస్టర్ పొలంబడి క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, జిల్లా వనరుల కేంద్రం డి డి ఏ బోసు బాబు మరియు కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి. చంద్రశేఖర్ లు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది కాబట్టి మిత్ర పురుగుల సంఖ్య విపరీతంగా పెరిగిందన ఆ మిత్ర పురుగులను సంరక్షించుకోవడానికి పురుగుమందులను వాడకూడదని వాటిని వాడటం వల్ల ముందుగా మనకు మేలు చేస్తే మిత్ర పురుగులను మనం కోల్పోవడం జరుగుతుందని తెలిపారు.వరి సాగులో వేప వాడకం చాలా ప్రాధాన్యత ఉందని దీనిని వేప పిండిగా అలాగే వేప నూనెగా వినియోగించి నప్పుడు పురుగుల ఉధృతి తగ్గే అవకాశం ఉందని గుడ్డు దశలో వాడినప్పుడు పిల్ల పురుగులు రావని, అలాగే పిల్ల పురుగు దశలో వాడినప్పుడు మొక్కంతా చేదుగా ఉండటం వల్ల వాటికి సరైన తిండి లేక చనిపోయే అవకాశం ఉందని, రెక్కల పురుగు దశలో వాడినప్పుడు అవి గుడ్లు పెట్టడానికి అయిష్టతను చూపుతాయని ఇన్ని ఉపయోగాలు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం పొలంబడు రైతులకు 50% రాయితీపై వేప నూనెను సరఫరా చేస్తుంది కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోస్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో బి రాజారావు వీఏలు మరియు రైతులు పాల్గొన్నారు.